ప్రజాశక్తి

బుధవారం 1 జనవరి 2025



ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరపాలి

- అరకు సిఐ హిమగిరి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ హిమగిరి తెలిపారు. అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమగిరి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వేడుకలను కుటుంబ సమేతంగా, ఇళ్లలో సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్, రేస్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, బెదిరింపులకు పాల్పడడం, రోడ్లపై వెళ్ళే వారిని ఇబ్బందికి గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో పోలీస్ పర్మిషన్ లేకుండా డీజే సౌండ్స్ నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే పోలీస్ కేసులు పెట్టడం జరుగుతుందని తెలిపారు.

యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపునకు చర్యలు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: ఉపాధి అవకాశాలు కోసం జిల్లా లో యువతకు నైపుణ్యాభివృద్ధి పెంచుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నైపుణ్య అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏల పరిధిలో గల అన్ని యువజన శిక్షణ కేంద్రాల ద్వారా డిడియు జి కే వై పథకం ద్వారా రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలను సీఎం కే వి వై పథకం కింద నాన్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ సెంటర్స్ గా నమోదు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సంకల్ప్ పథకంలో భాగంగా అడల్సెంట్ గర్ల్స్, సరెండర్డ్ మావోయిస్టులకు టైలరింగ్ లాంటి ఉపాధి ఆధారిత శిక్షణలను అందించటానికి, వర్క్ ఫ్రమ్ హెూం ఉపాధి అవకాశాలు కల్పించడానికి గల అవకాశాలని అధ్యయనం చేయాలని సూచించారు. మూడు ఐటీడీఏల పరిధిలో మెగా జాబ్ మేళాలు నిర్వహించాలని, ప్రతి ఐటీడీఏ పరిధిలో స్కిల్ వర్క్ షాప్స్ నిర్వహించాలని ఐటీడీఏల ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. వర్క్ ఫ్రమ్ హెూం అవకాశాలలో డిగ్రీ అర్హత కలిగిన వాలంటీర్లకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ప్రతి ఐటీడీఏ పరిధిలో జరిగే స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలపై పిఒలు సర్వే చేయాలని, నిరుద్యోగ యువతకు కావాల్సిన కోర్సులను స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలులో చేర్చాలని సూచించారు. ఐటీడీఏల పరిధిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి నెల సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి పి.రోహిణి, ఎల్డిఎం నాయుడు, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.చిట్టి అబ్బాయ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్బీస్ నంద్, జిల్లా ఉద్యాన అధికారి రమేష్ కుమార్‌రావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ. సంగీత, కమిటీ సభ్యులు, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది, వర్చ్యువల్ విధానంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు వి.అభిషేక్, కే.సింహాచలం, అపూర్వ భరత్ తదితరులు పాల్గొన్నారు....

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణపై నిరసనలు



ఏపీ జెన్కో ఒ అండ్ ఎం ఈఈ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి-సీలేరు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం సీలేరులో నిరసన కార్యక్రమం చేపట్టారు. జీకే వీధి మండలం సీలేరు సిఐటియు కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదగా ఏపీ జెన్కో ఓ అండ్ ఎం కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. 'కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మొండు వైఖరి నశించాలి' 'విద్యుత్ సంస్థలు ప్రైవేటుకరణ తక్షణమే ఉపసంహరించుకోవాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఏపీ జెన్కో ఈఈ రాజేంద్రప్రసాద్‌కు, ఏపీ జెన్కో ఎఇ టెక్నికల్ పావనికి వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతా రాంబాబు, స్థానిక సిఐటియు గౌరవ అధ్యక్షులు ఎస్కే సుభాన్, సీలేరు బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బి లక్ష్మణ్, విష్ణుకుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, చండీగఢ్ తదితర రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ చట్ట సవరణ బిల్లుపైనా, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరు ఓ అండ్ ఎం డివిజన్ వన్‌లో పనిచేస్తున్న పీస్ వర్కర్లుకు ఉద్యోగ భద్రత కల్పించి, 30 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నెలలో ఆరు రోజులు మాత్రమే పని దినాలు కల్పిస్తూ ఒక్కొక్కరికి రూ.350 చొప్పున నెలకు కూలి ఇస్తే వారి కుటుంబాలు ఎలా జీవిస్తాయని ప్రశ్నించారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా న్యాయం చేయడం లేదన్నారు.

ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న హైయ్యర్ డ్రైవర్లు జీవో నెంబర్ 487 ప్రకారం కనీస వేతనం రూ.18000 పైగా ఇవ్వవలసి ఉండగా అమలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెయిడ్ హాలిడేస్, ఎర్నడ్ లీవ్, వీక్లీ ఆఫ్ వీడిఏ పాయింట్స్ టెర్మినల్ బెనిఫిట్స్, ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడిని తక్షణమే రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్‌సి ప్రకారం వేతనం, ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ ఎన్‌వి. రమణ, 70 మంది ఏపీ జెన్కో సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెంలో ఉన్న ఏపీ జెన్‌కో మోతుగూడెం చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద యూనియన్ పిలుపు మేరకు భోజనం సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. చండీగఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలను ప్రైవేట్‌కరణను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపినట్లు చెప్పారు. సీలేరు కాంప్లెక్స్ లో పని చేస్తున్న సుమారు 220 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రిజనల్ సెక్రటరీ రత్నాకర్, సూర్యనారాయణ, సీఐటీయూ నాయకులు బివి.రమణ, కాంట్రాక్టు కార్మికుల బ్రాంచ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌సన్, బ్రాంచ్ సెక్రటరీ పేపకాయల శ్రీను, ట్రెజరర్ మల్లేశ్వరరావు, జోషప్ సన్యాసిరావు, సూరిబాబు, దారమహేష్, రజిని, బాబురావు, సీత పాల్గొన్నారు.



మోతుగూడెం ఎపి జెన్కో చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అత్యాచార ఘటన కేసులో ముగ్గురు అరెస్టు

డిఎస్‌పి ప్రమోద్



ప్రజాశక్తి-జిమాడుగుల: జి.మాడుగుల గాంధీనగరం ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారం ఘటనకు పాల్పడిన ఒకరు, సహకరించిన ఇద్దరిపై అత్యాచారం, పోక్సో కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పాడేరు డీఎస్పీ కె.ప్రమోద్ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థిని తల్లిదండ్రులు ఈనెల 25న నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు పాఠశాలకు వెళ్లారన్నారు. తన కుమార్తెతోపాటు కుటుంబసభ్యులైన ఇద్దరు బాలికలను దుస్తుల దుకాణానికి తీసుకెళ్లారు.. దుస్తులు కొనుగోలు చేసి సాయంత్రం 4 గంటలకు పాఠశాల వద్ద వారిని దింపి వెళ్లి పోయారు. అదే రోజు 6 గంటలకు పదో తరగతి విద్యార్థిని పాఠశాల నుంచి బయటకు వచ్చిందని,. అప్పటికే గేటు వద్ద వేచి ఉన్న కొర్ర మల్లేశ్వరరావు, వంతాల సన్యాసిరావు, మరో మైనర్ బాలుడు (డ్రైవర్) బాలికను ఆటోలో తీసుకెళ్లారన్నారు. ఒక గదిలో రెండు రోజులు ఉంచి విద్యార్థినిపై మల్లేశ్వరరావు అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. . ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసిందని సమాచారం అందడంతో బాలికను జి.మాడుగుల మండలం గడుతూరు తీసుకెళ్లి బంధువు ఇంటిలో ఉంచాడని తెలిపారు.. బాలిక అదృశ్యమైనట్లు తెలుసుకున్న ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు వెతికి ఈనెల 27న ఆమె ఆచూకీ తెలుసుకొని, విద్యార్థినిని పోలీస్ స్టేషన్కు అప్పగించారన్నారు.. పోలీసులు బాలికను విచారించగా.. తనపై జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయతీ కొత్తదొడ్లుకు చెందిన కొర్ర మలేశ్వరరావు అత్యాచారం చేశాడని చెప్పిందన్నారు.. దీనికి వంతాల సన్యాసిరావు, మరో బాలుడు సహకరించారని తెలిపిందన్నారు.. ఈ ముగ్గురిపై అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసినట్లు డిఎస్పీ కె.ప్రమోద్ తెలిపారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నట్లు రిమాండుకు తరలించనున్నట్లు తెలిపారు.

డీలర్ల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు :

అల్లూరి సీతారామ రాజు జిల్లా, పాడేరు డివిజన్ పరిధిలో చౌకధరల దుకాణాలకు సంబంధించి డీలరు రాజీనామా లేదా మరణము లేదా రేషను కార్డుల సర్దుబాటు వలన క్రొత్తగా ఏర్పడిన డీలర్ ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు గుర్తించిన 30 ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించుటకు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. సదరు డీలర్ల ఎంపిక వ్రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుందని, అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్ లో పొందుపరచిన నిబంధనలకు లోబడి తమ దరఖాస్తులను సంబంధిత తహశీల్దారు కార్యాలయం నందు గానీ లేదా పాడేరు సబ్ కలక్టరు వారి కార్యాలయంలో జనవరి 15వ తేదీ సాయంత్రం .5.00ల లోపు నేరుగా అందచేయవలెనని సూచించారు. నోటిఫికేషన్ వివరములు మరియు దరఖాస్తు కావలసిన వారు సంబంధిత తహశీల్దారు కార్యాలయములో లేదా పాడేరు సబ్ కలక్టరు కార్యాలయములో కార్యాలయపు పని వేళలలో పొందవచ్చునని వివరించారు.

ఫారం పాండ్ పనుల పరిశీలన



ఉపాధి హామీ సిబ్బంది, రైతులతో మాట్లాడుతున్న విద్యాసాగర్

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని చిట్టెంపాడులో నిర్మించిన ఫారం పాండ్ పనులను ఎన్ఆర్ఇజిఎస్ అధికారి డి.వి.విద్యాసాగర్ మంగళవారం పరిశీలించారు. అలాగే గడబపాలెం ఆయిల్ పామ్ రైతులతో సమావేశమై మాట్లాడారు. అనంతరం కొయ్యూరు ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేతనదారులకు పనులు కల్పించడంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్, ఉపాధి హామీ ఎపిఒ శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న గిరిజనులు

గోతులు పూడ్చాలని ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సాగర పంచాయతీ ఆడపవలస రహదారిలో గుంతలు పూడ్చాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన మంగళవారం గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ, ఆంధ్ర, ఒడిశాకు ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయని చెప్పారు. అధికారులు స్పందించక పోవడంతో గతేడాది గ్రామస్థులందరూ కలిసి శ్రమదానంతో గుంతలను పూడ్చడం జరిగిందన్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి మరింత ప్రమాదకరంగా మారిందని చెప్పారు. ఇటీవల నాలుగు ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడపవలస రహదారిని మరమ్మతు చేసి ప్రమదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవ, ప్రసాద్, సింహాద్రి, సుమిత్, వాహనదారులు పాల్గొన్నారు.

పీసా కమిటీ ఎన్నికలపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: మండల పరిషత్ కార్యాలయంలో పీసా ఎన్నికల నిర్వహణపై ఎంపీపీ కూడ రాజుబాబు ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రామాన్ని ఉద్దేశించి ఎంపీడీఓ రమాదేవి మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజాప్రతినిధులు అధికారులకు సహాయ సహకారాలు అందించాలనీ కోరారు. పార్టీలకు అతీతంగా ఎన్నికల నిర్వహించాలని కోరారు. వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, పార్టీల రహితంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో, పెసా చట్టం పై అవగాహన ఉన్న వ్యక్తులు ఎన్నికయితే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ అప్పలరాజు, ఏఓ సన్యాసి రావు, ఎంపీటీసీ బాలకృష్ణ, నాగరాజు, నాగలక్ష్మీ సర్పంచ్‌లు బాకూరు వెంకట రమణరాజు, రేగం రమేష్, బొంజుబాబు, నైని సన్నీబాబు, కాకరి బొంజుబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

గిరిజనులకు ఉపయోగపడే పనులు చేస్తే గుర్తింపు

వీరభద్రరావు సన్మాన సభలో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం



ఉద్యోగ విరమణ చేసి వీరభద్రరావును సన్మానిస్తున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో ప్రాంతంలో గిరిజనలకు ఉపయోగపడే పనులు చేసిన ప్రతి ఉద్యోగికీ వారిలో మంచి గుర్తింపు ఉంటుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరం ఏజెన్సీలో 40 సంవత్సరాలు సుదీర్ఘ కాలం గిరిజనులకు సేవలు అందించి ఉద్యోగ విరమణ చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ అసిస్టెంట్ జూనియర్ ఇంజనీర్ యాళ్ల వీరభద్రరావు సన్మాన కార్యక్రమం మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశపు మందిరంలో జరిగింది. వీరభద్రరావును పూలమాలలు, సాలువాతో ప్రాజెక్ట్ అధికారి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ 1985లో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా 20 సంవత్సరాలు, అసిస్టెంట్ జూనియర్ ఇంజనీర్‌గా 20 సంవత్సరాలు పని చేయడం అభినందనీయమన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజన ప్రాంతంలోని గిరిజనులకు వివిధ రకాలైన సేవలందించిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ శిరస్థాయిలో ప్రజల్లో గుర్తింపు ఉంటుందని చెప్పారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సకాలంలో వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వీరభద్రరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శాంతి, ఉపాధి హామీ పథకం ఎపిడి జి.శ్రీనివాసరావు, పీహెచ్‌ఓ కే.చిట్టిబాబు, పిఏఓ ఎల్.రాంబాబు, ఏటీవో కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరికృష్ణ, డిప్యూటీ ఇంజనీర్లు గౌతమి, పట్టేం వెంకటరమణ, ఏఈ సత్యనారాయణ, జెఇ ఉమామహేశ్వరరావు, పీకే నాగేశ్వరరావు, రమణ, మాజీ సూపరింటెండెంట్ రమణ, రాజారెడ్డి, దయానంద్, ఎస్ఓ మార్తమ్మ, డిప్యూటీ తాసిల్దార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్ర్రాలను సక్రమంగా నిర్వహించండి

- డిఇఒ పి.బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రత్యేకావసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను సక్రమంగా నిర్వహించేలా చూడాలని లోపాలు కనిపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని డిఇఒ పి.బ్రహ్మాజీరావు అన్నారు. జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులకు జిల్లా కేంద్రంలోని తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలో ఐఇ, ఎఎల్ఎస్ కో యాక్టివిటీస్ పై మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిడబ్ల్యూఎస్ఎన్ పిల్లల పురోగతికి అందరూ పాటుపడాలన్నారు. పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉపాధ్యాయులకు సూచనలు చేయాలన్నారు. స్టేట్ కన్సల్టెంట్ నరసింహారావు, రిసోర్స్ పర్సన్ మహాలక్ష్మి నాయుడు హాజరై ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్, ఎఎల్ఎస్ కో పై పూర్తి వివరాలను వివరించారు. సమగ్ర శిక్ష జిల్లా ఐఇ కోఆర్డినేటర్ కె.భాస్కరరావు మాట్లాడుతూ భవిత సెంటర్లలో సంబంధిత సిబ్బంది సిడబ్ల్యూఎస్ఎన్ పిల్లల నమోదు ప్రక్రియలో అలసత్వం వద్దని సూచించారు. సమగ్ర శిక్ష జిల్లా ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ కూర్మారావు మాట్లాడుతూ బడిబయట పిల్లలు, ఎన్ఆర్ఎస్ టికి సంబంధించి సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష జిల్లాకు సబంధించిన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెడ్ క్రాస్ బృందం పలు పాఠశాల సందర్శించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఆదేశాల మేరకు డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యాసంస్థలు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థినిలతో సమావేశమై ఆరోగ్య సూత్రాలపై పలు సూచనలు చేశారు. మండలంలోని కస్తూరిబాయి గాంధీ పాఠశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగరాజు, కోశాధికారి సూర్యరావు, సభ్యులు ప్రసాద్ నాయుడు, జిల్లా కోఆర్డినేటర్ లోహితస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా గ్రామాలను గుర్తించి ప్యాకేజీ ఇవ్వాలి



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య


ప్రజాశక్తి-కూనవరం

ముంపు వల్ల బాగా నష్టపోతున్న గ్రామాల్లో కొన్నింటిని ప్రయారిటీ గ్రామాలుగా గుర్తించి వాటికి తక్షణమే ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ఆవుల నాగమయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బొర్రయ్య మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూములకు తగిన నష్ట పరిహారం అందించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ప్రతి నిర్వసితుడికీ న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య ఎంపీటీసీ అమ్మాజీ, సర్పంచ్ వెంకమ్మ, నాయకులు తలగాని నాగరాజు, గడ్డిపాటి షణ్ముకేశ్వరావు, శ్యామల కృష్ణ, ఆవుల మురళి, ఉపేంద్ర, కర్నాటి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, సుధారాణి, తమ్మయ్య, కొండా ఈశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని బూదరాళ్ల పంచాయతీ గరిమండ గ్రామంలో 163 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ భూమి పూజ చేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యాతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతన పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వంతాల కుమారి, పంచాయతీ వార్డు సభ్యుడు సంజీవ్, కూటమి నేత కునిశెట్టి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న సర్పంచ్, స్థానికులు

అర్హులకు గృహాలు మంజూరు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన



నినాదాలు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అర్హులైన గిరిజనుల ందరికీ గృహాలు మంజూరు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు సోలగం గాసిరందొర ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. తహసిల్దార్ నర్సమ్మకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసి గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న భగత, వాల్మీకి, మాలి, కొండ కుమ్మరి, కోటియ, కమ్మర, గౌడు తదితర తెగలకు గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మంజూరైన అర్ధాంతంగా నిలిచిన గృహాలకు సైతం బిల్లులు మంజూరు చేయాలన్నారు. బేస్మెంట్ లెవెల్, మెంటల్ లెవెల్ పూర్తయిన వాటికి తక్షణమే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పీఎం జన్మన్ నిధులు కేటాయించిన మాదిరిగానే ఆదివాసులు అందరికీ ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో మండల తహసిల్దార్, హౌసింగ్ కార్యాలయాలను ముట్టడించి, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ నిరసన చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు నర్సింగ్ పడాల్, బాలరాజు, సొన్ను, ప్రహ్లాద్, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నోటీసులను వెనక్కి తీసుకోవాలి



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి -హుకుంపేట:- హుకుంపేట గ్రామంలో ఆదివాసులు నిర్మించుకున్న నిర్మాణాలకు రెవెన్యు అధికారులు అందజేసిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారావు కి ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాంగి సోమన్న, కృష్ణారావు లు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, ఆదివాసుల స్థానికులు అని సర్వహక్కులు కలిగి ఉన్నారన్నారు. నోటీసులు ఇచ్చి కాళీ చేయమని చెప్పడం సరికాదని వారు మంది పడ్డారు. హక్కుపత్రాలు కలిగి ఇంటిపన్ను సైతం చెల్లిస్తున్నారన్నారు. హక్కు పత్రాలు లేనివారికి హక్కుపత్రాలు అందజేయాలని వారు డిమాండ్ చేసారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. గిరిజనేతరులు 1/70 చట్టం ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

ఎపిటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి అనంతగిరి:మండల ఉపాధ్యాయ ఫెడరేషన్ ఎపీటీఎఫ్ ఉద్యోగుల సంఘం క్యాలండర్ రాష్ట్ర జిసిసి చైర్మన్ శ్రావణ్ కుమార్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు మండల ఏపీటీఎఫ్ యూనియన్ అధ్యక్షులు డి సన్యాసిరావు ఆధ్వర్యంలో కేలండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై శ్రీనివాసరావు, మండల ఏపీటీఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

పకడ్బందీగా పించన్ల పంపిణీ

- కలెక్టర్ దినేష్ కుమార్



పించన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-హుకుంపేట:ఫించన్ల పంపిణీని అత్యంత పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే ఫించన్ పంపిణీని ప్రారంభించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం హుకుంపేట మండలం తాడిపుట్టు పంచాయతి ఫరిదిలో గడుగుపల్లి గ్రామంలో కలెక్టర్ స్వయంగా ఫించన్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి లబ్దిదారునికి వారి ఇంటి వద్దే ఫించన్ పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేసారు. వీలుకాని పక్షంలో కొన్ని ప్రాంతాలలో లబ్దిదారు ఇంటి నుండి 300 మీటర్ల లోపు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కార్యక్రమాన్ని అత్యంత పక్కాగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 78 శాతం పైగా ఫించన్ పంపిణీ పూర్తి చేయడం జరిగిందన్నారు. కుటుంబంలో పింఛను తీసుకునే భర్త చనిపోతే ఆ పింఛను మొత్తాన్ని అతని భార్యకు వితంతువు కేటగిరీ కింద వెంటనే ఇచ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. మూడు నెలలుగా పింఛన్ తీసుకోని లబ్దిదారులకు కూడా రెండు, మూడు నెలల పింఛన్ మొత్తాన్ని కలిపి ఇదే నెలలో ఒకేసారి అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సిగ్నల్ సమస్య ఉన్న చోట మినహా, మిగిలిన అన్ని చోటా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను అందజేయాలనే ఆలోచనను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి వి.మురళి, ఎంపిడిఓ టి.రమాదేవి, స్థానిక సర్పంచ్ ఎస్. సత్యవతి పాల్గొన్నారు.

నకిలీ సరుకుల నియంత్రణకు చర్యలు :కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు : వారపు సంతలలో నకిలీ సరుకులు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ విసి హాలు నుండి వివిధ శాఖల కార్యకలాపాలపై సమీక్షించిన కలెక్టర్ ఆహార భద్రత శాఖను సమీక్షిస్తూ, స్టేక్ హెూల్డర్స్ తో సమావేశాలు నిర్వహించి నకిలీ సరుకులు, సబ్ స్టాండర్డ్ సరుకులు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా వసతి గృహాలకు సరుకులు సరఫరా చేసే వారిపై కూడా నిఘా పెట్టాలని, నాణ్యత ప్రమాణాలు పాటించని టెండరుదార్లకు నోటీసులు జారీ చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో ఎన్ సి డిసి డి సర్వేలో వెనుకబడి ఉండటానికి గల కారణాలను ఆరా తీసిన కలెక్టర్ సర్వే వేగవంతం చేయాలని, సిగ్నల్ లేని గ్రామాలను గుర్తించి నివేదిస్తే అఫ్ లైన్ అవకాశం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్ సి హెచ్ పోర్టల్ ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, గర్భిణీలు, శిశువుల నమోదు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. సికిల్ సెల్ అనీమియా కార్డులు త్వరితగతిన పంపిణీ చేయాలన్నారు. పలు గ్రామాలలో శిశువులకు పసర మందులు ఇస్తున్నందు శిశు మరణాలు సంభవిస్తున్నాయని కొందరు మెడికల్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా కలెక్టర్ స్పందిస్తూ పసర మందుల పై అధ్యయనం చేయాలని ఆదేశించారు. అందుకు ఆసుపత్రి పర్యవేక్షకులు, మెడికల్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ను ఆదేశించారు. జి ల్లా పంచాయతి అధికారి సమీక్షలో స్వర్ణ పంచాయత్ కింద ఇంటి పన్నులను 99 శాతం పైగా ఆన్లైన్ చేయటం పట్ల అభినందించిన కలెక్టర్ క్లోరినేషన్, ట్యాంక్ ల శుభ్రతలో పాడేరు డివిజన్ ఫరిధిలో తక్కువ శాతం మాత్రమె చేయటం జరిగిందని, త్వరితగతిన క్లోరినేషన్, ట్యాంక్ ల శుభ్రత పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో డిఎంహెచ్ఓ జమాల్‌భాషా, డిపిఓ లవరాజు, గిరిజన సంక్షేమ డిడి ఎల్. రజని, ఆర్ డబ్ల్యు ఎస్ ఇఇ జవహర్ కుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి, వర్చువల్ విధానంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు వి. అభిషేక్, కే. సింహాచలం, అపూర్వ భరత్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : మత్తు వల్ల ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని, అనేక నేరాలకు మత్తు కూడా ఒక కారణమేనని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. మంగళవారం పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మత్తు అనర్థాలు, దాని వల్ల కలిగే పరిణామాలు, నేరాలపై ప్రజల్లో అవగాహనకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎంవి.శేషమ్మ మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలకు డబ్బులు అలవాటు చేయరాదన్నారు. పిల్లలు ఎవరితో తిరుగుతున్నారు, వారి స్నేహబంధాలు, వారి నడవడికలపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉండాలన్నారు. గంజాయి, డగ్స్‌కు నేటితరం యువత అలవాటు పడడం దురదృష్టకరమన్నారు. దీనిపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలకు తీసుకోవడం, వాటి రవాణా, అమ్మకాల్లో భాగస్వాములైతే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణిస్తోందన్నారు. అసాంఘిక చర్యలపై ప్రజలంతా సంఘటితంగా పోలీసులకు సమాచారమిచ్చి, వాటి నియంత్రణకు సహకరించాలని కోరారు. నేటి పోటీప్రపంచంలో పిల్లలను దానికి అనుగుణంగా సన్నద్ధం చేయడంతో తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. వివిధ కేసుల్లో కోర్టుకు వచ్చే కక్షిదారులు తాము న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేకుంటే ప్రభుత్వం తరపున న్యాయసహాయాన్ని అందిస్తామన్నారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఆయా కేసుల్లో శిక్ష, జరిమానాలు కఠినంగా ఉన్నాయన్నారు.

నార్త్ జోన్ ఎసిపి అప్పలరాజు మాట్లాడుతూ సబ్ జోన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి, మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పిఎం పాలెం సిఐ జి.బాలకృష్ణ, ఎస్ఐ సునీత, శ్యాంప్రసాద్ కాలనీవాసులు పాల్గొన్నారు.

చదువు పట్ల అశ్రద్ధ చేయకండి

- ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : చదువు పట్ల గిరి విద్యార్థులు అశ్రద్ధ చేయకండని ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం సూచించారు.మండలంలో ఎమ్మెల్యే మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, గిరిజన బాలుర, నందివలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. తెలుగు, ఆంగ్లంపై విద్యార్థుల వెనుకబాటుపై అసహనం వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుందని, ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యంశాలను నెమరు వేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో చదువులు చెప్పి వారి బంగారు భవిష్యత్తును చక్కదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. నందివలస బాలికల ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్నం భోజనంపై అసహనం వ్యక్తం చేశారు. అరమ పంచాయతీ కేంద్రంలో పీహెచ్‌సి భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా మొదలు పెట్టారని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులపై, కాంట్రాక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. లైగండలో సమస్యలపై ఆ పంచాయతీ సర్పంచి లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామారావు పాల్గొన్నారు.

సాగుపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -చింతపల్లి: పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతులకు వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి బి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఎర్రబొమ్మల పంచాయతీ కొండవంచుల, రోలంగి తదితర గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా రైతులకు భూసార పరీక్షలు, రైతు రిజిస్ట్రీ, సున్నా వడ్డీ పంట రుణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం పై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలపై పర్యవేక్షణ ఉండాలి

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లాలోని జి.మాడుగుల మండలం గాంధీనగర్ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అత్యాచార ఘటనపై రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు స్థానిక విలేకరులకు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసారు. ఆశ్రమ పాఠశాలల నిర్వాహకులు అప్రమత్తంగా వుండాలనీ, నిరంతర పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం వుందన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాల్సి వుందన్నారు.విద్యార్థిని అత్యాచార ఘటనకు సంబంధించి సమగ్ర నివేదికను అందజేయాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఇటువంటి సంఘటనలు భవిష్యత్ లో చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.



ప్రమాద వివరాలు తెలుపుతున్న బాధితులు

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- రెండు ఇళ్లు దగ్ధం - రూ.10 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-దేవీపట్నం : మండలంలోని ఇందుకూరు గ్రామపంచాయతీ పరిధి ఎమ్.రావిలంక గ్రామంలో సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకొని రెండు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. గ్రామానికి చెందిన ప్రబంధకవి నాగేశ్వరరావు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించి ఆయన ఇల్లు కాలిపోయింది. ఆ సమయంలో ఆయన ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలి తిప్పని కన్నయమ్మ ఇంటిపై పడడంతో ఆమె ఇల్లు కూడా పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. దీంతో రెండు ఇళ్లలో సుమారు రూ.10 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. రెండు ఇళ్లల్లో నివసిస్తున్న వారు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. వీరికి రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు, కొంత నగదు అందించారు. జనసేన మండల అధ్యక్షులు సారపరాయుడు, నాయకులు బాధితులకు నిత్యవసర సరుకులు, బట్టలు అందజేశారు.

కార్గోలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి మూడు త్రైమాసికాల్లో 60 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను నిర్వహించడం ద్వారా 91 ఏళ్ల పోర్టు చరిత్రలో ఒక సువర్ణ ఘట్టాన్ని నమోదు చేసింది. ఈ విషయాన్ని విపిఎ కార్యదర్శి టి.వేణు గోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24లో మొదటి మూడు త్రైమాసికాల్లో చేసిన 59.73 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించి నూతన రికార్డును పోర్టు నెలకొల్పిందని, సమిష్టి కృషి, వ్యూహాత్మక ప్రణాళికలు, ఆధునిక లాజిస్టిక్స్, ఆపరేషనల్ వ్యవస్థల సమన్వయంతోనే ఈ అనూహ్య విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. కొత్త 100 ఎమ్‌టి క్రేన్ ఏర్పాటు, విసిటిపిఎల్ ద్వారా యంత్రాంగాన్ని మెరుగుపరచడం, వేగవంతమైన కార్గో నిర్వహణ కోసం అత్యాధునిక సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తేవడం, సాంకేతిక సదుపాయాల్లో భాగంగా రియల్ టైమ్ కార్గో మానిటరింగ్ కోసం, డ్యాష్ బోర్డ్ అనలిటిక్స్, కార్యాచరణ సమర్థత కోసం సమన్వయ వ్యవస్థల ఏర్పాటు నూతన రికార్డుకు దోహదపడ్డాయన్నారు. ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన సిబ్బందిని, భాగస్వాములను పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందించారు. ఈ రికార్డు పోర్టుకు దేశ వాణిజ్యాభివృద్ధిలో ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. పోర్టు యాంత్రీకరణ, బహుముఖ మౌలిక వసతుల కల్పన ద్వారా వివిధ మార్గాలను అనుసంధానం చేసే పనులకు ప్రాధాన్యతనిస్తున్నట్టు పేర్కొన్నారు. అందుకోసం 10 లైన్ల రహదారుల విస్తరణ, అంతర్గత ఫ్లైఓవర్ల నిర్మాణం, ప్రస్తుత టెర్మినల్స్ ఆధునికీకరణ. వంటి పనులను శీఘ్రగతిన చేపడుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టులు పోర్టును సముద్ర వాణిజ్యంలో మరింత బలోపేతం చేయడంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు.

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిసిలో 1/2019 సర్క్యులర్‌ను పూర్తిగా అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లను రద్దు చేసి బాధిత ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నగర పరిధిలోని ఆర్‌టిసి డిపోల ఎదుట ఎపి పిటిడి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాలు నిర్వహించారు. భోజన విరామ సమయంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి చేపట్టిన ధర్నాను ఉద్దేశించి యూనియన్ జోనల్ అధ్యక్షులు కెజె.సుధాకర్, గౌరవ అధ్యక్షులు ఎంవిఎస్.రెడ్డి మాట్లాడారు. ఇటీవల సస్పెండ్ చేస్తూ వివిధ డిపోలకు ఇచ్చిన వారిని తిరిగి వారి పాత డిపోలకు వెనక్కి తీసుకురావాలన్నారు.


విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్ల ఆందోళన

ప్రజాశక్తి-ఎటపాక

గత ప్రభుత్వంలో పనిచేసిన గ్రామ, వార్డు వాలంటీర్లను తక్షణమే విధులోకి తీసుకోవాలని, వాలంటీర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వాలంటీర్లు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డేగల మాధవరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వాలంటీర్లతో వెట్టి చాకిరి చేయించుకుని అతి తక్కువ వేతనం చెల్లించి వారిని మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే వాలంటీర్లను కొనసాగిస్తామని, వారికి రూ.10,000 వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, నాగరాజు, దుర్గ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎటపాకలో వినతిపత్రం అందజేస్తున్న వాలంటీర్లు



కోతులగుట్టలో వినతిపత్రం అందజేస్తున్న వాలంటీర్లు

కూనవరం : మండలంలోని కోతులగుట్టలో వాలంటీర్లు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 10 వేల రూపాయలు గౌరవ వేతనం ఇస్తానని నమ్మించి నేడు విధుల్లో నుండి తప్పించడం దారుణమన్నారు. ఉద్యోగాలు లేక అర్ధకలితో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే వాలంటీర్లను విధుల్లోకి తీయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు తాళ్లూరు శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు కొండ ఈశ్వర్లు, సొందే పద్మావతి, శాంతి, మున్నేశ్వరావు, వసంత్, భద్రమ్మ, సోనియా, శిరీష, నాగరాజు, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

7590 మందికి ప్రయోజనం

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 3 నుంచి జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమల్లోకి రానుంది. సమీప పాఠశాలల నుంచి జూనియర్ కాలేజీ విద్యార్థులకు భోజనాలను ఆటోల్లో పంపించనున్నారు. ఈ రవాణా ఖర్చులు ప్రభుత్వం చెల్లించనుంది. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంతో జిల్లాలోని 7590 మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. వాటిలో వివిధ సెక్షన్లలో 7590 మంది విద్యార్థులున్నట్లు ఇంటర్ విద్యాశాఖాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆయా కాలేజీల్లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మ్యాపింగ్ చేసిన ప్రభుత్వ పాఠశాలల నుంచి వండిన భోజనాలు రానున్నాయి. కాలేజీ విద్యార్థుల భోజనాలకు ప్లేట్లు, గ్లాసులను ప్రభుత్వం అందజేయనుంది. కాలేజీలకు అదనపు భారం లేకుండా వంటల బాధ్యతను పాఠశాలల నిర్వాహకులకు అప్పగించింది. హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని జూనియర్ కాలేజీల్లో నాలుగు నుంచి మధ్యాహ్న భోజన పథకం అమల్లోకి రానుంది. ఆమె చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతో విద్యార్థులు తమ ఇళ్ల దగ్గర నుంచి క్యారేజీలు తీసుకురావాల్సిన అవసరం తగ్గుతుంది. ఇంటర్‌లో విద్యార్థులు చదువు మధ్యలో మానేయడంతో ఆ సంఖ్యను తగ్గించేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించినట్లు ప్రభుత్వం చెబుతోంది.

హామీల అమల్లో బాబు విఫలం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చంద్రబాబు ఆరు నెలల పాలనంతా వంచన, మోసంతో సాగిందని, హామీలను అమలు చేయడంలో ఘోరంగా ఆయన విఫలమయ్యారని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. మంగళవారం ఉదయం మద్దిలపాలెంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను బాబు మోసం చేశారన్నారు. గడిచిన ఆరు నెలల్లోనే లబ్ధిదారులకు రూ.60 వేల కోట్లు బకాయి పడ్డారని తెలిపారు. 2024లో రెండు ప్రభుత్వాల పాలనను ప్రజలు గమనించారని, ఎవరి పాలన ఎలా ఉందనేది వారికి స్పష్టంగా తెలిసిందని అన్నారు. ఆనాడు రాష్ట్రం శ్రీలంక అయిందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, ఆయన నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే ఏకంగా రూ.1.12 లక్షల కోట్ల అప్పు చేసిందని, దేశంలోనే ధనిక సిఎం చంద్రబాబు అని ఎడిఆర్ రిపోర్టు బయటపెట్టిందని అన్నారు. ఇప్పటికైనా విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కూటమి వైఖరి ఏమిటో చెప్పాలని అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. జనవరి 8న స్టీల్‌ప్లాంట్‌పై ప్రధానితో స్పష్టమైన ప్రకటన చేయించాలన్నారు.



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషా దేవి

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లును రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని చిన్న గెద్దాడ గ్రామంలో పెన్షన్‌దారుడు ముర్ల సోమిరెడ్డి మంగళవారం మృతి చెందగా ప్రభుత్వం నుంచి వచ్చిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను అతని కుటుంబానికి ఎమ్మెల్యే మిరియాల శిరీష, మాజీ శాసనసభ్యులు చిన్నం బాబు రమేష్ అందజేశారు. బీవీ కోట పంచాయతీ, నల్లగొండ గ్రామంలో కోసు రామన్న దొర మూడు ఎకరాలకు సంబంధించిన వరి కుప్పలు పూర్తిగా దగ్ధం కావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి పొలం వద్దకు వెళ్లి కాలిపోయిన వరి కుప్పలను పరిశీలించారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చెల్లిబోయిన శ్రీనివాసరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన వారిని అభినందిస్తున్న అతిథులు

ముగిసిన వింటర్ చెస్ క్యాంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో తలపెట్టిన అంతర్జాతీయ ప్రమాణాలుగల వింటర్ చెస్ క్యాంపు విజయవంతంగా ముగిసింది. ఆశీల్‌మెట్ట ఎసెంట్ జూనియర్ కాలేజీలో జరిగిన ఈ శిక్షణా శిబిరంలో అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన రవి, అఖిల్, రుత్విక్‌లను ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ స్థాయి అనుభవం కలిగిన ఫిడే ట్రైనర్ కేశవానంద 50 గంటల పాటు 4 రోజుల ఇంటెన్సివ్ శిక్షణ అందించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 53 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. 6 సంవత్సరాల పిల్లల నుండి 60 సంవత్సరాల పెద్దలు వరకు ఈ చెస్ క్యాంపునకు హాజరయ్యారు. కామన్‌వెల్త్ అండర్ 12 సిల్వర్ మెడల్ విజేత అఖిల్ ప్రసాద్, జి.రవికృష్ణ, ఫిడే రేటింగ్ టోర్నమెంట్ విజేత ఎంవి.రుత్విక్ తదితర ఆటగాళ్ళు ఈ ప్రతిష్టాత్మక శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు.

ఈ శిబిరంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ఎమ్‌డి ఆఫ్ అసెంట్ క్లాసెస్ డాక్టర్ ఉమాధర్ పట్నాయక్, స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రిన్సిపాల్ మల్ల శర్వాని, డెర్మటాలజిస్ట్ డాక్టర్ సిద్ధార్థ్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శ్రీ హర్ష అవార్డులు అందజేశారు. యులోజికా సిఇఒ రాజు చిత్రాడ, విజయలక్ష్మి పతకాలు, సర్టిఫికెట్లను అందించారు.